ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
శుక్రవారం 24 మే 2024

కరువు పరిహారం తక్షణమే అందజేయాలి : రైతు సంఘం

రాయచూరు, మే 23 : ప్రభుత్వం గతేడాది ప్రకటించిన కరువు పరిహారాన్ని తక్షణమే అందజేయాలని కర్ణాటక రైతు సంఘం మసిరుసేనల జిల్లా అధ్యక్షుడు కేపై బసవరాజ్ నాయక్ హిరేకొట్నెకల్ డిమాండ్ చేశారు. గురువారం మాన్విలో విలేకరులతో మాట్లాడిన ఆయన అధికారుల నిర్లక్ష్యం వల్లే సకాలంలో పరిహారం అందలేదన్నారు. తుంగభద్ర ఎడమకాలువ నీరును సమర్థవంతంగా విడుదల చేసి ఈ ఏడాది రైతులకు సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి సాగునీటి శాఖ అధికారులకు ప్రత్యేక ఆదేశాలివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



కాక రేపనున్న కాఫీ

● అమాంతం పెరిగిన గింజల ధరలు ● కాఫీప్రియులకు భారం తప్పదు
● కర్ణాటక పంటకు ప్రపంచమంతటా డిమాండ్ ● రాష్ట్రంలో 4లక్షల హెక్టార్లలో సాగు...

బెంగళూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): నిద్రలేవగానే బెడ్ కాఫీతో ఎంతోమంది రోజు ప్రారంభమవుతుంది. నలుగురు కలిస్తే కాఫీ తాగుదామా అనే మాటే వినిపిస్తుంది. అయితే కాఫీ ప్రియుల జేబులకు మరింత చిల్లులు పడే రోజులు వచ్చేశాయ్. ప్రస్తుతం సాధారణ హోటళ్లలో రూ.15 నుంచి 20 రూపాయలు, కొంత విలాసవంతమైన రెస్టారెంట్‌లలో రూ.40-100 దాకా ధర ఉంది. కాఫీ పార్లర్, కెఫెలలో రూ.80 నుంచి రూ.800 దాకా కాఫీ వెలగా ఉంది. మరికొన్ని రోజుల్లోనే 5నుంచి10శాతం అంటే రూ.30-50కుపైగా కాఫీ ధర పెరగనుంది. క్వాలిటీ కాఫీ తాగాలంటే మరింత భారాన్ని భరించాల్సిందే. వాతావరణంలో మార్పుల కారణంగా ప్రపంచమంతటా కాఫీ దిగుబడి గణనీయంగా తగ్గింది. కాఫీ ఉత్పత్తిలో బ్రెజిల్, వియత్నాం లోనూ కాఫీ దిగుబడి గణనీయంగా తగ్గింది. ఈ పరిణామాలతో దేశవ్యాప్తంగా కాఫీకి డిమాండ్ పెరిగింది. కాఫీ బోర్డ్ గణాంకాల ప్రకారం ఏప్రిల్‌లోనే 40,434 మెట్రిక్ టన్నుల కాఫీ విదేశాలకు ఎగుమతి అయ్యింది. రానున్న రోజుల్లో ఇది మరింత పెరగనుంది. ఇది దేశీయ కాఫీకి అంతర్జాతీయ స్థాయిలో ఉన్న డిమాండ్‌ను సూచిస్తుంది. విశ్వవ్యాప్తంగా భారీ డిమాండ్ రావడంతో కాఫీ గింజల ధరలు ఆకాశన్నంటాయి. ఈ ప్రభావం స్థానికంగాను కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఇదే ఏప్రిల్ నెలలో కాఫీ గింజల ధరలు నాలుగు సార్లకు పైగా పెరిగాయి. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని కాఫీపొడి డీలర్‌లు అభిప్రాయపడుతున్నారు.



కర్ణాటక కాఫీ గింజలకు భలే డిమాండ్...

కర్ణాటకలో పండించే కాఫీ పంటకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ నెలకొంది. ఇండియన్ కాఫీ మార్కెట్ ఎప్పుడూ గ్లోబల్ మార్కెట్‌కు అనుగుణంగానే ఉంటుంది. అంతర్జాతీయ స్థాయిలో ధరలు పెరిగినా తగ్గినా దేశీయ మార్కెట్‌పై ప్రభావం చూపనుంది. ప్రస్తుతం గ్లోబల్ స్థాయిలో కాఫీ ధరలు పెరిగిన తరుణంలో రాష్ట్రంలోనూ ఇదే పరిస్థితి కొనసాగనుందని కాఫీ బోర్డు సీఈఓ జగదీశ్ అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో కాఫీ గింజల ధరలు పెరగడంతో దేశంలోనూ ఆ ప్రభావం పడింది. కాఫీ తోటల రైతులకు ఇది సంతోషాన్ని కలిగించే అంశం. గడిచిన దశాబ్దన్నర కాలంలో కాఫీ గింజలకు ఈ స్థాయిలో ధరలు చేరలేదు. దేశవ్యాప్తంగా పండే కాఫీ గింజల్లో 71శాతం కర్ణాటకలోనే పండిస్తారు. ప్రధానంగా చిక్కమగళూరు, హాసన్, కొడగు, దక్షిణకన్నడ జిల్లాలతోపాటు అనుబంధ జిల్లాల్లో కొంత మేర సాగు అవుతుంది. మిగిలిన 21శాతం కేరళలోనూ, తమిళనాడులో 5శాతం సాగు చేస్తారు. అయితే కర్ణాటక కాఫీ గింజలు నాణ్యమైనవి కావడంతో డిమాండ్ అధికంగా ఉంటోంది. రాష్ట్రంలో 4లక్షల హెక్టార్లలో కాఫీ సాగు చేస్తారు. గత ఏడాది 3.52 లక్షల మెట్రిక్ టన్నుల కాఫీ గింజలు దిగుబడి సాధ్యమైంది.

● వారం క్రితం నాటి ధరలు కేజీల ప్రకారం రోబస్టా రూ.582, కాగా అరేబికా రూ.620 గా ఉంది. ఏప్రిల్ చివరివారంలో రోబస్టా రూ.448, అరేబికా రూ.483గా ఉండేది. వారం రోజుల వ్యవధిలోనే కిలోకు 150 రూపాయలకుపైగా ధర పెరగడం గమనార్హం. పెరుగుతున్న ధరలతో కాఫీ ప్రియుల్లో దిగులు మొదలైంది.


రాష్ట్రంలో పండే నాణ్యమైన కాఫీ గింజలు

దేశంలో కాఫీ ధరలు ఇలా...

సంవత్సరం	ఉత్పత్తి (మెట్రిక్ టన్ను)	విలువ డాలర్లలో	దేశంలో విలువ రూ.కోట్లలో
2023-24	3,96,000	1,146	8,983
2022-23	3,88,000	1,290	10,491
2024 ఏప్రిల్	40,434	155	1,290




కాఫీ బోర్డు కార్యాలయం

బీరు..జోరు

● ఈ ఏడాది రికార్డు స్థాయిలో విక్రయాలు
● బళ్లారి జిల్లా ఎక్సైజ్ కమిషనర్ మంజునాథ్



బళ్లారి,మే 23(ఆంధ్రజ్యోతి): మద్యం అమ్మకాలు గతేడాదితో పోలిస్తే ఈసారి భారీగా పెరిగాయని, వేసవిలో బీర్ల అమ్మకాలు 26.58 శాతం అధికంగా జరిగాయని బళ్లారి జిల్లా ఎక్సైజ్ కమిషనర్ మంజునాథ్ పేర్కొన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. బళ్లారి జిల్లా ఎక్సైజ్ శాఖ పదిలో మొత్తం 5 డివిజన్లు ఏర్పాటు చేశామన్నారు. బళ్లారి-1, బళ్లారి-2, కంప్లి, సండూరు, సిరుగుప్ప, ఇలా మెత్తం 5 నియోజక వర్గాల్లో 5 వలయాలు ఉన్నాయన్నారు. 2023తో పోలిస్తే 2024 నాటికి 26.58 శాతం బీర్ల అమ్మకాలు అధికంగా జరిగాయన్నారు. వేసవిలో విస్కీ, బ్రాందీ లాంటి లిక్కర్ల కన్నా బీర్లు ఎక్కువ అమ్మారన్నారు.

● బళ్లారి జిల్లాలో సీఎల్-2 షాపులు 90, సీఎల్-4 రకం 1, సీఎల్- 7 రకం33, సీఎల్-8 రకం 2, సీఎల్-9 రకం44, సీఎల్-11 రకం 28, ఆర్‌వీబి లు 2,ఎల్ఎఫ్‌డ్ల రకం 09 లైసెన్సు షాపులు ఉన్నాయన్నారు.

● 2023 నుంచి 2024 ఏడాది కాలంలో 2,457 చోట్ల దాడులు నిర్వహించామన్నారు. 1,731 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. షాపుల్లో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేశామన్నారు. దాడుల్లో 7031.443 లీటర్ల మద్యం, ఇతర రాష్ట్రాల నుంచి తెస్తున్న 77.900లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. 800 సారా బట్టీలు ధ్వంసం చేశామన్నారు. అక్రమంగా కల్లు తరలిస్తున్న 21 మందిని అరెస్ట్ చేశామన్నారు. గంజాయి సరఫరా చేస్తున్న 143 మందిపై కేసు నమోదు చేశామన్నారు.

● బళ్లారి రేంజ్ పరిధిలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు విక్రయించేవారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి గంజా తెచ్చినా లేదా ఇక్కడే గంజా పండిస్తూ మత్తు పదార్థంగా తయారు చేసినా అటు వంటి వారిపై చట్టపర కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బళ్లారి నగరం అలాగే చుట్టుపక్కల ప్రాంతాల్లో గంజాయి. ఇతర మాదకద్రవ్యాలు సేవించేవారు, సరఫరా చేస్తున్నవారి జాబితాను పోలీసులతో కలిపి తయారు చేశామన్నారు. అక్రమంగా మద్యం అమ్మినా, మత్తుపదార్థాలు ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవన్నారు.

19 ఏళ్ల నాటి హత్యాకాండ..

● ఏడుగురు పోలీసులను చంపిన కేసులో మాజీ మావోయిస్ట్ అరెస్ట్

పావగడ, మే 23: దాదాపు రెండు దశాబ్దాల తర్వాత పోలీసులను చంపిన కేసులో మాజీ మావోయిస్ట్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పావగడ తాలుకా సరిహద్దు వెంగటమ్మనహళ్ళిలో 19 సంవత్సరాల క్రితం జరిగిన పోలీస్ హత్యా కాండలో కొత్తగెరె గ్రామానికి చెందిన శంకర్‌ను పావగడ పోలీసులు బుధవారం రాత్రి అరెస్టు చేశారు. తుమకూరు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపిన వివరాల మేరకు 2005 ఫిబ్రవరి 10వ తేదీ రాత్రి వెంగటమ్మనహళ్ళి పాఠశాలలో పోలీసులపై మావోయిస్టులు మారణహోమం సృష్టించారు. బాంబులు, తుపాకులతో దాడి చేసి ఏడుగురు పోలీసులను దారుణంగా కడతేర్చారు. ఈ ఘటన అప్పుడు ఇరు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించింది. ఈ కేసుకు సంబంధించి 200 మంది దాకా నక్సల్ సానుభూతిపరులను అరెస్ట్ చేసి 32 మందిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో ప్రజాగాయకుడు దివంగత గద్దర్ విప్లవ సంఘం నేత వరవరరావును కూడా 12, 13వ ముద్దాయిలుగా పావగడ కోర్టులో 2021లో హాజరు పరిచారు. ఈ ఘటనలో జామీను రహిత వారెంట్‌ను పోలీసులు ఆదేశించడంతో కొందరు ముద్దాయిలు తలదాచుకున్నారు. అరెస్ట్ అయిన కొత్తగెరె శంకర్ బెంగళూరులో బీబీఎంపీ డ్రైవర్‌గా పని చేస్తూ గౌరీ పాళ్యంలో వెంకటస్వామి గార్డెన్‌లో నివసిస్తుండేవాడు. సమాచారం మేరకు పావగడ, తిరుమణి పోలీసులు బెంగళూరుకు వెళ్ళి అరెస్టు చేనట్లు ఎస్పీ తెలిపారు. శంకర్‌ను 14 రోజులపాటు రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.



సాగుకు సహకరించండి..

● ముందుగానే కరుణించిన వరుణుడు ● దుక్కి దున్నుతున్న రైతులు
● అన్నదాతకు సౌకర్యాలు కల్పించాలి ● జిల్లా అధికారుల సమావేశంలో సీఎం


జిల్లా అధికారులతో సమీక్ష జరుపుతున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య, మంత్రులు

బెంగళూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగు కాలం ప్రారంభమవుతోందని, ఈ ఏడాది నైరుతిరుతుపవనాల కంటే ముందస్తు వర్షాలు ఆశాదాయకంగా ఉన్నందున రైతుకు సహకరించాలని సీఎం సిద్దరామయ్య అధికారులను ఆదేశించారు. గురువారం విధానసౌధలో అధికారులతో ప్రత్యేకంగా సీఎం సమీక్ష జరిపారు. జిల్లాధికారులు, జిల్లాపంచాయతీ సీఈఓలు, వ్యవసాయ, ఉద్యానశాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేలో సాధారణం కంటే అధిక వర్షం కురిసిందన్నారు. మేనెలలో 2.95 హెక్టార్లలో దుక్కులు దున్నారన్నారు. 68వేల ఎకరాలలో విత్తనాలు వేశారన్నారు. ఇంకా 13రోజులు ఉందన్నారు. ప్రాంతాల వారీగా రైతులు సాగు చేసే విత్తనాలు, ఎరువులతో పాటు ఇతరత్రా సౌకర్యాలను సమకూర్చాలన్నారు. జూన్ 6వరకూ ఎన్నికల కోడ్ ఉందని అయినా అత్యవసర పనుల విషయంలో నిర్లక్ష్యం సరికాదన్నారు. జిల్లాధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బడ్జెట్ ప్రవేశపెట్టి ఇప్పటికే రెండునెలలు ముగుస్తోందని, వచ్చే పదినెలల వ్యవధిలోనే ఏడాది పనులు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. జూన్ నెలాఖరు నాటికి పెండింగ్ పనుల ప్రక్రియలను ఆరంభించాలన్నారు. 500లకు పైగా హామీలు ఇచ్చామని వాటి గురించి జిల్లాధికారులు దృష్టి సారించాలన్నారు. మైసూరు పరిధిలో రెండు గ్రామాల్లో కలరా ప్రబలిన విషయమై చర్చించారు. ఎక్కడ కలరా ప్రబలినా సంబంధిత అధికారులపైనే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వర్షాకాలం ప్రారంభంలో కలుషిత నీరు తాగే అవకాశాలు ఉంటాయని గ్రామాల వారీగా అధికారులు పర్యటించి చర్యలు తీసుకోవాలన్నారు. సకాలంలో రైతులకు పంటరుణాలు అందేలా జిల్లా స్థాయిలో బ్యాంకర్లతో సమావేశాలు నిర్వహించాలన్నారు. కరువు పరిహారాన్ని రైతులకు నగదు రూపంలో ఇవ్వాలని ఎట్టి పరిస్థితిలోను పాత అప్పులకు జమచేయరాదని బ్యాంకర్లను ఆదేశించారు. డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు హెచ్‌కే పాటిల్, మునియప్ప, కృష్ణబైరేగౌడ, చలువరాయస్వామి, శివరాజ్‌తంగడిగితో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రజనీష్‌గోయల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధానమంత్రి అయ్యే అర్హత కలిగిన వారు లేరని వ్యాఖ్యానించలేదన్నారు. కర్ణాటక నుంచి ప్రధానమంత్రి పదవి అభ్యర్థిని తాను కాదని, అయ్యే ఆలోచన కూడా లేదని పేర్కొన్నా నన్నారు. ప్రధాని పదవికి అర్హులైన వారు సమర్థులు రాష్ట్రంలో ఉన్నారన్నారు. తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారన్నారు.

ఫోన్ ట్యాపింగ్ వంటి నీచమైన పనులు చేయను

● కుమార వ్యాఖ్యలపై మండిపడ్డ ముఖ్యమంత్రి

బెంగళూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ వంటి నీచమైన, దిగజారుడు పనులు చేయలేదని , చేసేది లేదని సీఎం సిద్దరామయ్య పేర్కొన్నారు. హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు సంబంధించిన రాసలీల పెన్‌డ్రైవ్‌ను డీసీఎం డీకే శివకుమార్ బహిరంగం చేశారని ఆరోపణలు చేసిన తర్వాత తనతో పాటు 30మంది నాయకులు, తమ కుటుంబ సభ్యులకు చెందని ఫోన్‌లు ట్యాపింగ్ చేశారంటూ కుమార స్వామి ఆరోపించారు. దీనిపై సీఎం, డీసీఎం ఘాటుగా స్పందించారు. ఫోన్ ట్యాపింగ్ అనేది సిగ్గులేని చర్య అంతటి దిగజారుడు రాజకీయాలు చేసేది లేదని డీసీఎం డీకే శివకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజ్వల్ వివాదాన్ని దారితప్పించేందుకు కుమారస్వామి ఇటువంటి ఆరోపణలు చేశారన్నారు. రాజకీయాలు చేస్తాం కానీ దిగజారుడు చర్యలు ఎప్పటికీ చేసేది లేదని స్పష్టం చేశారు. కాగా కుమారస్వామి వ్యాఖ్యలపై ప్రతిపక్షనేత ఆశోక్ మద్దతుగా మాట్లాడారు. కుమారస్వామికి పలువురు పోలీసు ఉన్నతాధికారులతో పరిచయం ఉందని ఎవరినుంచి అయినా సమాచారం వచ్చి ఉండవచ్చన్నారు. ఫోన్ ట్యాపింగ్ యంత్రాలు రాష్ట్రంలోనే 30-40లక్షలకు లభిస్తాయన్నారు. అటువంటి యంత్రాలు ఎన్ని ఉన్నాయో ప్రభుత్వమే దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు.

గోవిందా..!

● వైభవంగా లక్ష్మీవెంకటేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం

బెంగళూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక తెలుగురాష్ట్రాల ప్రజల ఆరాధ్య దైవం గడిదంలో వెలసిన లక్ష్మీవెంకటేశ్వర బ్రహ్మరథోత్సవం గురువారం కనుల పండువగా జరిగింది. వేలాదిమంది భక్తుల గోవిందనామస్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. చిక్‌బళ్లాపుర జిల్లా బాగేపల్లి తాలూకా గడిదం వద్ద వెలసిన స్వామి వారికి ఏటా వైశాఖ శుద్ధ పౌర్ణమినాడు బ్రహ్మరథోత్సవం జరపడం ఆనవాయితీ. భక్తుల కొంగు బంగారమై భక్తులకు దర్శనమిస్తూ మరో తిరుమలగా ప్రసిద్ధిగాంచిన గడిదం ఎంతో ప్రాచీనమైనది. జనమేజయ మహారాజులచే నిర్మించబడిన ఆలయం ఘటోద్ఘజుని జన్మస్థలం గడిదం కొండ పక్కన ఉంది. గతంలో మూడునెలల పాటు జాతర జరిగేది. జాతర సందర్భంగా జరిగే పశువుల సంతకు బాగేపల్లి, చిక్కబళ్ళాపుర, గుడిబండతో పాటు హిందూపురం, కదిరి, గోరంట్ల ప్రాంతాలకు చెందిన వారు వచ్చి పశువుల క్రయవిక్రయాలు జరిపేవారు. ప్రస్తుతం జాతర కేవలం ఒక రోజుకే పరిమితంగా బ్రహ్మరథోత్సవంతో ముగుస్తోంది. ప్రత్యేకంగా అలంకరించిన తేరుపై ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తారు. స్థానిక ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి, తహసీల్దారు ప్రశాంత్ కె పాటిల్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ వర్ధితోపాటు భక్తులు తేరును లాగారు. రథోత్సవంలో పాల్గొన్న భక్తులకు పానకం, ప్రసాదం పంపిణీ చేశారు. అర్యవైశ్య బ్రాహ్మణ సంఘాలకు చెందిన వారు అన్నదానం చేశారు. స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు.


అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

హంపిలో బయటపడిన రాయల కాలం నాటి బావి


హంపిలో బయటపడిన పురాతన బావి

బళ్లారి,మే23(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించిన బావి హంపిలోని విరుపాక్షేశ్వరస్వామి దేవాలయం వద్ద ఉన్న మంటపాల సమీపంలో బయట పడింది. తవ్వకాలు చేస్తుండగా ఈబావి బయట పడినట్లు పురావస్తు శాఖ అధికారులు వెల్లడించారు. ఈ సారి ఎండలు మండిపోయాయి. నేలపై కాలు మోపడానికి కూడా వీలు కానంతగా ఎండ ఉండేది. కానీ ఈ ప్రాంతంలో ఎవరైనా నిల్చుంటే కాలు కింద చల్లదనం వచ్చేది. దీంతో తవ్వకాలు జరుపుతుండగా బావి బయట పడింది. 8 అడుగుల లోతులో ఇది బయట పడినట్లు అధికారులు పేర్కొన్నారు. తుంగభద్ర నది సమీపంలో ఉండడంతో నీరు పుష్కలంగా చేరినట్లు తెలిపారు. రాజులు తాగునీరు కోసం దీనిని నిర్మించి ఉంటారని పురావస్తు శాఖ అధికారులు పేర్కొంటున్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,577.49	1,579.10
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	00	380
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	12	191
సామర్థ్యం (టీఎంసీలు)	3.37	4.06

ఘనంగా బుద్ధ జయంతి


సంగనకల్లులో బుద్ధజయంతి నిర్వహిస్తున్న దృశ్యం

బళ్లారిరూరల్, మే 23: బుద్ధజయంతి సందర్భంగా గురువారం బళ్లారి తాలుకాలోని సంగనకల్లు గ్రామంలో బుద్ధుని విగ్రహాన్ని ప్రతిష్టించిన స్థలంలో బుద్ధ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మంత్రి నాగేంద్ర స్నేహితుడు వెంకటగిరి దళవాయి మాట్లాడుతూ 'బుద్ధం శరణం గచ్ఛామి' అంటూ మంచిని బోధించారన్నారు. గురువారం బుద్ధ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంగనకల్లు విజయ్‌కుమార్, ఓంకారప్ప, యర్రన్న, ఈరణ్ణ, వెంకమ్మ, సిరివరం గాదెలింగ, గుమ్మనూరు జగన్నాథ్, శ్రీనివాసమూర్తి, గంగాధర, సిరివరం గాదెలింగ, గ్రామ పంచాయతీ సభ్యులు, పంచాయతీ సభ్యురాలు ప్రమీల పాల్గొన్నారు.

ప్రజలంతా ఐకమత్యంతో మెలగాలి


మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేష్

సిరుగుప్ప, మే 23: ప్రజలందరూ ఐకమత్యంగా మెలగాలని డీఎస్పీ వెంకటేష్ తెలిపారు. సిరుగుప్ప పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం తాలుకా పరిపాలనా, పోలీసు శాఖ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేష్ మాట్లాడుతూ ప్రజలందరూ కులమత బేధాలు మరచి ఐకమత్యంగా జీవించాలని తెలిపారు. స్వాతంత్ర్యం కోసం భారతీయులు ఎందరో పోరాటాలు చేసి, త్యాగాలు చేసి మృతి చెంది చివరకు భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించారన్నారు. ఆనాడు అనేక మంది ప్రాణ త్యాగాలు చేయడంతోనే ఈ నాడు అందరూ ప్రశాంతంగా జీవిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సమాజ సేవకుడు అబ్దుల్ నబీ, హనుమంతప్ప, పట్టణ ప్రముఖులు శంభులింగయ్య స్వామి, చెన్నయ్య స్వామి, మోహిద్దీన్, సార్వజనికులు పాల్గొన్నారు.

స్టాంపుల ప్రదర్శనతో మానసిక వికాసం


స్టాంపుల ప్రదర్శనను తిలకిస్తున్న ఎస్పీ రంజిత్‌కుమార్

బళ్లారి సిటీ, మే 23: తపాలా స్టాంపుల ప్రదర్శన పిల్లల మానసిక వికాసానికి తోడ్పడుతుందని జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు అన్నారు. తపాలా స్టాంపుల ప్రదర్శన బుధవారం పోలీస్ జింఖానా మైదానంలో జరిగింది. భారత తపాలా శాఖ బళ్లారి విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శనను జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రంజిత్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, స్టాంపుల సేకరణ వలన చరిత్ర, క్రీడలు, స్మారక చిహ్నాలు, పరిశోధనలు, శాస్త్రవేత్తలు, వివిధ రంగాల్లో నిపుణులు, ప్రముఖ ప్రదేశాలు, జంతువులు, పక్షుల గురించి తెలుస్తుందన్నారు. ముఖ్యంగా బళ్లారి జిల్లాలోని ఎలుగుబంటి అభయారణ్యం గురించి, అంతరించిపోతున్న గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ పక్షి, గురించి తెలుస్తుందన్నారు. బళ్లారికి చెందిన బళ్లారి రాఘవ, రావ్ బహద్దూర్ మహాబలేశ్వరప్ప సహా పలువురు ప్రముఖుల పోస్టల్ కవర్ల ప్రదర్శన అందరి దృష్టిని ఆకర్షించింది. అదే విధంగా పురాతన, నాణేలు, నోట్లు సమానత్వం గురించి పిల్లల అవగాహనకు సహాయపడతాయన్నారు. బళ్లారి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వీఎల్ చితకోటి మాట్లాడుతూ... తపాలా బిళ్లల సేకరణ అభిరుచిని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం దీన్‌దయాళ్ స్కాలర్‌షిప్ ఇస్తోందన్నారు. జిమ్‌ఖాన్ అధ్యక్షుడు జితేంద్ర మాట్లాడుతూ పిల్లల్లో స్టాంపుల సేకరణ అలవాటును పెంపొందించాలన్నారు. ఈసందర్భంగా సీనియర్ స్టాంపు కలెక్టర్ శివానంద, అల్లాసాబ్ పాల్గొన్నారు.

హంపి మంటపాలకు గండం

భారీవర్షంలో నాని కూలిపోతున్న వైనం.. కలెక్టర్ పరిశీలన


హంపిలో నేలకొరుగుతున్న మంటపం


పురాతత్వ శాఖ అధికారులతో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్ ఎంఎస్ దివాకర్

కంప్లి, మే 23 : దక్షిణ కాశీగా పేరుపొందిన హంపి పుణ్యక్షేత్రంలో గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు విరుపాక్షేశ్వరస్వామి ఆలయం ముందున్న సాలమంటపాలు నేలకొరుగుతున్నాయి. జిల్లా అధికారి ఎంఎస్ దివాకర్ గురువారం కూలిన మంటపాల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత పురాతత్వ శాఖ అధికారులు పురాతన మంటపాల అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించిన వీటిని రక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వీటి పునర్నిర్మాణానికి కేంద్రం ద్వారా నిధులు మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే గ్రామ పంచాయతీ అధికారులు పలు చోట్ల నామఫలకాలను ఏర్పాటు చేయాలన్నారు. పర్యాటకులు వర్షం వచ్చే సమయంలోనూ, రాత్రివేళల్లోనూ మండపాల వద్దకు వెళ్లకుండా చూడాలని హంపిలోని ప్రజలకు సూచించారు. హోమ్‌గార్డులు, ఆలయ సిబ్బంది ప్రతి ఒక్కరు అప్రమత్తంగా వుంటూ పర్యాటకులకు ఎలాంటి అనర్థం జరుగకుండా చూడాలని సూచించారు. త్వరలోనే మంటపాల అభివృద్ధి పనులపై దృష్టి సారిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు దేవరాజు, ఉలిగప్ప, రాజ్‌కుమార్, విరుపాక్షి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వర స్వామి రథోత్సవం

బళ్లారిరూరల్, మే 23 : బళ్లారి తాలుకాలోని రూపనగుడి గ్రామంలో గురువారం సాయంత్రం వెంకటేశ్వర స్వామి వారి మహా రథోత్సవం వైభవంగా జరిగింది. ఈ రథోత్సవానికి పలు గ్రామాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి స్వామి వారికి వివిధ రకాల ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు రథాన్ని వెంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి రావి చెట్టు వరకు లాగి మొక్కులు తీర్చుకున్నారు.


వెంకటేశ్వరస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

లారీని ఢీకొన్న బైకు: వ్యక్తి మృతి

బళ్లారిరూరల్, మే23: తాలుకాలోని గోడేహాళ్‌గ్రామం వరీస్ బాబా దర్గా సమీపంలో బుధవారం రాత్రి బైక్‌పై వెళుతున్న అమలాపురం గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి లారీ వెనుక నుంచి ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. అతడిని స్థానికులు వెంటనే బళ్లారి విమ్స్ హాస్పిటల్‌కు తరలించగా, చికిత్స పొందుతూ అక్కడ మృతిచెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పీడీ హళ్లి పోలీసులు తెలిపారు.

జొన్న కొనుగోళ్లపై రైతులు ఆందోళన చెందవద్దు

జూన్ 30 వరకు గడువు: గోడౌన్ మేనేజర్ అమరేష్

సిరుగుప్ప, మే 23 : జొన్న రైతులు ఆవేదన చెందాల్సిన అవసరం లేదని, జూన్ 30వ తేదీ వరకు వారి నుంచి జొన్నలు కొనుగోలు చేస్తామని గోడౌన్ మేనేజర్ అమరేష్ తెలిపారు. సిరుగుప్ప పట్టణంలో గురువారం అమరేష్ విలేకరులతో మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి నేటి వరకు రూ. 1.86 లక్షల క్వింటాళ్లను కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు క్వింటాల్‌కు రూ.3180 మద్దతు ధర ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. జొన్నలను నిల్వ చేసేందుకు అచ్చొళ్లి గోడౌన్ మరమ్మతు పనులు చేపట్టి 80 వేల బస్తాలను అందులో నిల్వ చేసినట్లు తెలిపారు. మిగతా వాటిని సిరుగుప్ప ఏపీఎంసీ గోడౌన్‌లో నిల్వ చేసినట్లు ఆయన తెలిపారు. టార్గెట్‌కు మించి జొన్నల లోడు ట్రాక్టర్లు ఒకేసారి రావడంతో అన్‌లోడింగ్ చేయడంలో కొంతమేర నిర్లక్ష్యం జరిగిందని తెలిపారు. ఇక ముందు అలాంటి సమస్య వుండదని, జూన్ 30 వరకు జొన్నలు కొనుగోలు చేస్తామని తెలిపారు.


ఏపీఎంసీ వద్ద అన్‌లోడింగ్ కోసం ఆగిన జొన్నల ట్రాక్టర్లు

దోమల ద్వారా వ్యాధుల వ్యాప్తిని అరికట్టాలి

బళ్లారి సిటీ, మే 23: ముందస్తుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజానీకం ఇంటి చుట్టూ నీరు నిలవకుండా చూసుకోవాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రమేశ్ విజ్ఞప్తిచేశారు. వారానికోసారి నీటి తొట్టెలను శుభ్రం చేసి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టాలన్నారు.. ఇంటి చుట్టూ, ఇంటిపైన పూల కుండీలు డబ్బాల్లో వర్షం నీరు చేరే అవకాశం ఉందని, వీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. ప్లాస్టిక్ కప్పులు మొదలైన వాటితో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. క్లోరినేషన్‌తో శుద్ధిచేసిన నీటిని త్రాగాలన్నారు. భోజనానికి ముందు మరుగుదొడ్లకు వెళ్ళిన తర్వాత సబ్బుతో చేతులు కడుక్కోవాలని తెలిపారు. ఆసుపత్రుల్లో అవసరమైన అన్ని మందులను ఇప్పటికే స్టాక్‌లో ఉంచామని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అసౌకర్యం కలగకుండా నిర్ణీత సమయానికి ఓపీడీ స్లిప్ అందించాలన్నారు. రోగులు వైద్యుల గది దగ్గర కూర్చునేందుకు వీలుగా సీట్లు పెంచాలని వైద్యులకు సూచించారు. ఈసందర్భంగా జిల్లా మలేరియా నియంత్రణ అధికారి డాక్టర్ అబ్దుల్లా, డాక్టర్ సతీశ్, డాక్టర్ భరత్, మెడికల్ ఆఫీసర్ కిరణ్ తదితరులు నర్సులు పాల్గొన్నారు.

కాకర్లతోట తిమ్మప్ప సేవలు ఎనలేనివి

- వర్ధంతి సభలో బళ్లారి రాఘవ కళామందిర్ గౌరవాధ్యక్షుడు చన్నప్ప

బళ్లారి సిటీ, మే23: కాకర్లతోట కనుగోలు తిమ్మప్ప బళ్లారి రాఘవ కళామందిర్‌కు చేసిన సేవలు ఎనలేనివని ఆ సంస్థ గౌరవాధ్యక్షులు చన్నప్ప అన్నారు. బళ్లారిలోని రాఘవ కళామందిరంలో కాకర్లతోట కనుగోలు తిమ్మప్ప 24వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం రాఘవ స్మారక సంఘం వారు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈసందర్భంగా రిటైర్డ్ లెక్చరర్, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు బసవరాజ్ మాట్లాడుతూ, తిమ్మప్ప 1903 మే5న బళ్లారిలోని కాకర్లతోట గ్రామంలో జన్మించారని, 1962నుంచి 69 వరకు అతను కంప్లి షుగర్ ఫ్యాక్టరీ, బళ్లారి జనతా బజార్ అధ్యక్షుడిగా పనిచేశారన్నారు. ఆయన


జ్యోతి వెలిగించి, కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చన్నప్ప తదితరులు

1971నుండి 2000 సంవత్సరం వరకు జనతా బజార్ అధ్యక్షుడిగా పనిచేశారని, అలాగే 1981నుంచి రాఘవ మెమోరియల్ అసోషియేషన్ అధ్యక్షునిగా కన్నడ తెలుగు నాటకాలను ప్రోత్సహించి ఉత్తమ కళాకారులను సత్కరించారన్నారు. 1980-81లో బళ్లారి రాఘవ శతజయంతి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారన్నారు. ఆయన నిత్యం సన్మార్గంలో నడిచి ఇతరులకు మార్గదర్శకంగా నిలిచారన్నారు. కనుగోలు తిమ్మప్ప సాధించిన విజయాన్ని సంస్థ కార్యవర్గ సభ్యులు చెల్లా అమరేంద్రనాథ్ చౌదరి స్మరించుకున్నారు. సంస్థ గౌరవ కార్యదర్శి ప్రకాశ్, ఉపాధ్యక్షులు విష్ణువర్దన్‌రెడ్డి,రమేశ్‌గౌడ పాటిల్, కార్యదర్శి రామాంజినేయులు, కే.రామంజినేయులు. కృష్ణ, టి.జి.విఠల్, ప్రభాకర్, గాదెం గోపాలకృష్ణ, శ్యామ్‌సుందర్, పంపనగౌడ, డాక్టర్ రమేశ్‌గోపాల్, కనుగోలు అనిల్‌బాబు, యశ్వంత్ రాజ్, మంజునాథ్, శేషారెడ్డి, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేశులు రచించిన తెలుగు నాటకం 'అంతా అయోమయం' ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. కళాకారులు నాగభూషణం, గురుశాంత్, రామచంద్ర, మురళి, సంజన, కాళిదాసు, రామాంజినేయులు నాటకంలో అద్భుతంగా నటించి ప్రేక్షుల మెప్పుపొందారు.

మూడు రోజుల పాటు బళ్లారిలో
ఫ్యాషన్ స్టోరీ ఎగ్జిబిషన్


ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మహిళలు

బళ్లారి సిటీ, మే 23: దేశంలోని వివిధ రాష్ట్రాలకుచెందిన ఆభరణాలు, దుస్తులు, ఫర్నిచర్ ఒకే చోట అందించేందుకు ఫ్యాషన్ స్టోరీ ఎగ్జిబిషన్‌ను బళ్లారిలోని రాయల్‌పోర్టు హోటల్లో గురువారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రవి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలకు చెందిన అన్ని బ్రాండ్లు ఒకే చోట అందుబాటులో ఉండే విధంగా సారీలు, కుర్తీలు, జ్యూలరీ, హోం డెకోరేషన్స్, ఇంటికి సంబంధించిన అన్నివస్తువులు ఒకే చోట అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. విజయలక్ష్మి స్కిల్స్, వైష్ణవి సిల్క్స్, ఎథీరియల్ ఫ్యాషన్లు, పెహచాన్, హోం కంఫర్ట్స్, నురాణి డ్రెసెస్ బ్రాండ్ల వంటి అగ్రశ్రేణి డ్రెస్ మెటీరియల్స్ ఇక్కడ చూడవచ్చన్నారు. అందరికీ అందుబాటు ధరలతో ఇతర రాష్ట్రాలకు వెళ్లే అవసరం లేకుండా అన్నిరాష్ట్రాల ఉత్పత్తులను ఫ్యాషన్ స్టోరీ ఎగ్జిబిషన్‌లో అందిస్తున్నట్లు తెలిపారు. ఈ మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ ఎగ్జిబిషన్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

కంది విత్తనాల కోసం బారులుతీరిన రైతులు

బళ్లారిరూరల్, మే 23 : బళ్లారి రూరల్ ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులోని ఆంధ్ర రైతులు గురువారం బళ్లారి నగరంలో అధిక దిగుబడి నిచ్చే ఓ ప్రైవేట్ బ్రాండ్ కంది విత్తనాల కోసం బారులుతీరారు. రైతులకు అనుకూలంగా వర్షం ముందస్తుగా రావడంతో కంది పంటను జూన్ నెలాఖరు లేదా జూలై మొదటి వారంలో వేసుకునేందుకు అనుకూలంగా వుంటుందని భావిస్తున్నారు. దీంతో అనంతపురం జిల్లాలోని బెళుగుప్ప, తగ్గుపర్తి, ఉరవకొండ, ఆత్మకూరు, కూడేరు, వజ్రకరూరు, విడపనకల్లు మండలాల రైతులు పెద్దఎత్తున బళ్లారి నగరానికి చేరుకుని విత్తనాల కొనుగోలుకు ఎగబడ్డారు. బళ్లారి కేసీ రోడ్డులోని విత్తన విక్రయ కేంద్రాల వద్ద ఆంధ్ర రైతులు విత్తనాల కోసం ఉదయం 7 గంటలకే క్యూలైన్లో నిలబడి కంది విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. బెళుగుప్ప గ్రామానికి చెందిన రైతు ఈశ్వరయ్య మాట్లాడుతూ బళ్లారి నగరంలో ప్రైవేట్ సీడ్స్ కొనుగోలు చేసి కంది పంట సాగుచేస్తే అధిక దిగుబడి వస్తుందన్నారు. గతంలో 4 కిలోల కంది విత్తనాల బ్యాగు రూ. 600లు వుండేదని, అయితే దానిని ఈ యేడాది రూ. 800లకు పెంచారన్నారు.


కేసీ రోడ్డులో కంది విత్తనాల కోసం బారులుతీరిన ఆంధ్ర రైతులు

పిడుగుపాటుకు 14 గొర్రెల మృతి

కంప్లి, మే 23 : కురుగోడు తాలుకా చానాళ్ గ్రామంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి 14 గొర్రెలు మృతి చెందాయి. ఆ గ్రామానికి చెందిన హనుమేష్ వర్షం రావడంతో షెడ్‌లో గొర్రెలను వుంచాడు. ఒక్కసారిగా షెడ్డుపైన పిడుగుపడటంతో గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా సామాగ్రి చెల్లాచెదురైంది. డాక్టర్ మంజునాథ్, ఏఎస్ఐ అజీమ్, గ్రామలెక్క అధికారి గంగాధర పరిశీలించి ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు.


పిడుగుపాటుకు బూడిదైన గొర్రెలు

హోసూరు జోన్

గెయిల్ పైప్‌లైన్‌కు నిరసనగా రైతుల రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న రైతులు

హోసూరు, మే 23: వ్యవసాయ భూముల్లో గెయిల్ పైప్ లైన్ ఏర్పాటుకు నిరసనగా హోసూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతులు రోడ్డెక్కారు. యడయనల్లూరు, సూతాళం, నాగొండపల్లి, సమీపంలోని రైతుల భూముల్లో అనుమతి లేకుండా గియిల్ పైపు వేసే యోచనను రైతులు అడ్డుకోగా, జిల్లా యంత్రాంగం గెయిల్ పైపులను ఏర్పాటు చేసేందుకు గుంతలు తవ్వే ప్రయత్నం చేసిందని రైతుల ఆరోపిస్తున్నారు. గెయిల్ పైపులు వేయవద్దని రైతులు కోరుతున్నారు. అనంతరం తమిళనాడు రైతు సంఘం తరఫున హోసూరు రైతు సంఘం అధ్యక్షుడు తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపకార్యదర్శి పెరుమాళ్ హోసూరు సబ్‌కలెక్టర్‌కు ఎన్నిసార్లు పిటిషన్లు ఇచ్చినా పట్టించుకోకపోవడంతో ఆందోళనకు దిగామని తెలిపారు. ఇందులో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ప్రకాశ్, అధ్యక్షుడు మురుగేశన్, కోశాధికారి ఎం రాజు, ఉప కార్యదర్శి దేవరాజ్, మార్క్సిస్టు పార్టీ యూనియన్ కార్యదర్శి రాజారెడ్డి, నగర కార్యదర్శి జయరామన్, కార్యవర్గ సభ్యుడు జేమ్స్ ఏంజెలా మేరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోవిందస్వామి, సిఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీధర్, ఉపాధ్యక్షుడు మూర్తి, ఉప కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు. అక్కడ బందోబస్తులో ఉన్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

హోసూరు, మే 23: హోసూరు సమీపంలోని మిడుగరపల్లి పాఠశాలలో కర్ణాటక మద్యం ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందిన నేపథ్యంలో ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్ ఆధ్వర్యంలో మత్తిగిరి పోలీసులు మిడుగరపల్లి పరిధిలో తనిఖీలు నిర్వహించారు. తమిళనాడులో నిషేధించిన కర్ణాటక రాష్ట్ర మద్యం బాటిళ్లను విక్రయిస్తున్నట్లు తెలిసింది. వాటిని పోలీసులు స్వాధీనం చేసుకుని కెలమంగలం గ్రామానికి చెందిన రవి(43)ని అరెస్ట్ చేశారు. విచారణలో మిడుగరపల్లిలోని ఓ ఇంట్లో ఉంటూ మద్యం విక్రయిస్తున్నట్లు తెలిసింది. మత్తిగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు. వీటి విలువ రూ.12 వేలు ఉంటుందని తెలిపారు. 180 ఎంఎల్ బాటిళ్లు 133 ఉన్నట్లు తెలిసింది.

పైపు పగిలి.. తాగునీటి వృధా

హోసూరూ(సిఫ్‌కాట్) మే 23:

హోసూరు సమీపంలో హొగేనెకల్ తాగునీరు పైపు పగిలి మూడు రోజుల నుంచి నదిలా ప్రవహిస్తోంది. అత్తిపల్లి వెళ్లే టీవీఎస్ రోడ్డులో నంజాపురం సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద హొగెనెకల్ తాగు నీటి పైపు పగలడం వల్ల నీరు వృథాగా పోతోంది. ప్రస్తుతం హోసూరులోనే కాకుండా పొరుగు రాష్ట్రమైన బెంగళూరు చుట్టుప్రక్కల గ్రామాల్లో కూడా వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. తాగు నీరు దొరక్క ప్రజలు రోజువారీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్క ట్రాక్టర్‌ట్యాంకర్ నీరు రూ.వెయ్యి వంతున అమ్ముతున్నారు. ఈ పరిస్థితిలో పైపులు పగిలి తాగునీరు వృథాగా పోతూవుంటే ఎవరూ పట్టించుకోకపోవడంపట్ల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పగిలిపోయిన పైపులను వెంటనే సరిచేసి నీటి వృథాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆప్రాంత ప్రజలు కోరుతున్నారు.


హొగేనెకల్ ప్రాజెక్ట్ తాగునీటి పైపులైన్ పగిలి వృథాగా పోతున్న నీరు

భక్తిశ్రద్ధలతో వైశాఖ పౌర్ణమి పూజలు

రాయచూరు, మే 23 : వైశాఖశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం నగరంలోని ఓం సాయి ధ్యాన మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల ధార్మిక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించిన ఆలయ నిర్వాహకులు భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మేఘన భీమరెడ్డి, లక్ష్మినారాయణ రైస్‌మిల్ యజమాని హరీశ్ రామకృష్ణల సహాయంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.


అన్నదానం నిర్వహిస్తున్న భక్తులు

నీటిని పొదుపుగా వాడుకోవాలి : ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే హంపనగౌడ బాదర్లి

రాయచూరు, మే 23: సింధనూరు నగర ప్రజలకు 10 రోజుల కొకసారి తాగునీటి విడుదల చేసేందుకు నిర్ణయించిన నేపథ్యంలో ప్రజలు నీటి వినియోగంలో మరింత పరిమితి అనుసరించాలని ఎమ్మెల్యే హంపనగౌడ బాదర్లి కోరారు. జిల్లాలోని సింధనూరు నగరంలో తాగునీటి ఎద్దడి తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో గతంలో 8 రోజులకొకసారి తాగునీటిని విడుదల చేస్తుండగా దాన్ని 10 రోజులకు పెంచినట్లు వివరించారు. గురువారం విలేకరులతో మాట్లాడిన ఎమ్మెల్యే, రాగల 15 రోజుల్లో తాగునీటి సమస్య తీవ్రరూపం దాలుస్తున్న నేపథ్యంలో ముందుజాగ్రత్తగా నీటి వినియోగాన్ని పరిమితం చేసినట్లు వివరించారు. అదే సమయంలో మరింత తీవ్రత ఎదురైతే తాలూకాలోని వివిధ గ్రామాల పరిధిలో చెరువులో ఉన్న నీటిని వినియోగించుకునేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జూన్ 2వ వారంగానీ, 3వ వారంలోగానీ సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉందనీ, అప్పటి వరకు ప్రజలు నీటి వినియోగంలో మరింత జాగ్రత్తగా ఉండాలని కోరారు.

రోడ్ల అభివృద్ధి కోసం మంత్రికి వినతి

రాయచూరు జిల్లాలో నాలుగులైన్‌ల రోడ్లవిస్తరణ పనులతో పాటు జాతీయ రహదారుల పనులను మరింత వేగవంతం చేయాలని కేపీసీసీ బీసీ విభాగం ఉపాధ్యక్షుడు తలకాయమారెప్ప కోరారు. బెంగళూరులో రాష్ట్ర ప్రజా పనులశాఖ మంత్రి సతీశ్ జారకిహోళిని గురువారం కలిసిన ఆయన ఈమేరకు వినతిపత్రం ఇచ్చారు. ట్రాఫిక్ సమస్య తీవ్రరూపందాలుస్తున్న నేపథ్యంలో రోడ్ల అభివృద్ధితో పాటు రింగ్‌రోడ్డు పనులను పూర్తి చేయాలన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్స్...

రాజ్‌దీప్ సర్దేశాయి (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత రాజ్‌దీప్ సర్దేశాయి 1965 మే 24న అహ్మదాబాద్‌లో జన్మించారు. పాత్రికేయుడు, రచయిత, న్యూస్ యాంకర్‌గా రాణించారు. ఎడిటర్ కలం పేరిట కథనాలు అందిస్తున్నారు. 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రిక ముంబై విభాగానికి ఎడిటర్‌గా పనిచేశారు. బుల్లితెరపై ఎన్‌డీటీవీలో పొలిటికల్ ఎడిటర్‌గా వ్యవహరించారు. తర్వాత సొంతంగా సీఎన్ఎన్-ఐబీఎన్ చానెల్ స్థాపించి ఎడిటర్-ఇన్-చీఫ్‌గా 2014వరకు కొనసాగారు. 2006లో రామ్‌నాథ్ గోయెంకా ఎక్సలెన్స్ ఇన్ జర్నలిజం అవార్డ్, 2008లో 'పద్మశ్రీ' 2020లో లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్ ఇన్ ఈఎన్‌బీఏ, తదితర పురస్కారాలు అందుకున్నారు. ప్రస్తుతం ఆయన 'ఇండియా టుడే టెలివిజన్' కు కన్సల్టింగ్ ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు.

బాబ్ డైలాన్ (పుట్టినరోజు)



'నోబెల్ పురస్కార' గ్రహీత బాబ్ డైలాన్ 1941 మే 24న జన్మించారు. అమెరికాకు చెందిన గాయకుడు, గేయ రచయితగానే కాకుండా రచయిత, విజువల్ ఆర్టిస్ట్‌గా రాణించారు. 60ఏళ్ల కెరీర్‌లో 100 మిలియన్‌లకుపైగా రికార్డులు విక్రయాలు చేసి 'బెస్ట్ సెల్లింగ్ మ్యూజీషియన్స్ ఆఫ్ ఆల్ టైమ్'గా పేరొందారు. 1960లో సివిల్ రైట్స్, యాంటీవార్ కదలికలపై రాసిన గేయాలు ఎంతో గుర్తింపు తెచ్చాయి. 10 గ్రామీ అవార్డులు, గోల్డెన్ గ్లోబ్ అవార్డు, 2016లో సాహిత్యంపై నోబెల్ పురస్కారం, రాక్ అండ్ రోల్ హాల్ ఆఫ్ ఫేంలో గుర్తింపు, ఇతర అవార్డులు అందుకున్నారు.



సందేశం ఇస్తున్న బౌద్ధ భిక్షువులు



ప్రార్థనల్లో బౌద్ధ సన్యాసులు



పూజల్లో పాల్గొన్న భక్తులు

వైభవంగా బుద్ధ జయంతి

బెంగళూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): గౌతమ బుద్ధుడి జయంతిని బౌద్ధమతస్థులు వైభవంగా జరుపుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గురువారం ప్రత్యేక కార్యక్రమాలు సాగాయి. బెంగళూరు సహకార నగర్‌తో పాటు పలు కేంద్రాలలో బుద్ధజయంతిని జరిపారు. బౌద్ధ భిక్షుకులు ప్రత్యేక సందేశాలు ఇచ్చారు. కలబురిగిలోని బుద్ధవిహార్‌కు వేలాది మంది భక్తులు వచ్చారు. కొడుగు జిల్లా కుశాల్‌నగర్‌కు అనుబంధంగా అతిపురాతనమైన బైలకుప్ప గోల్డెన్ టెంపుల్‌లో ఉదయం నుంచి రాత్రి దాకా జయంతి వేడుకలు జరిగాయి. ఏటా వైశాఖ మాసం పౌర్ణమి రోజున బుద్ధ జయంతిగా జరుపుకునే సంప్రదాయం ఉంది. ప్రతి బౌద్ధక్షేత్రంలోను భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అంజలి హత్య కేసు నిందితుడికి ఎనిమిది రోజుల కస్టడీ

బెంగళూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): హుబ్బళిలో అంజలి హత్యకేసు నిందితుడు గిరీష్‌కు గురువారం కోర్టు 8 రోజుల కస్టడీకి తీసుకుంది. నిందితుడు గిరీష్ రైలు ప్రమాదంలో గాయపడి హుబ్బళి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకున్న మేరకు గురువారం కోర్టు ముందు హాజరు పరిచారు. కోర్టు హాలులోకి ప్రవేశించగానే ఒక్కసారిగా కన్నీరు పెట్టారు. తప్పు జరిగిపోయింది నన్ను వదలిపెట్టండి అంటూ న్యాయాధికారిని వేడుకున్నారు. సీఐడీ పోలీసులు సమగ్ర విచారణ కోసం 15 రోజుల కస్టడీ కోరగా విచారణ అనంతరం ఎనిమిది రోజుల కస్టడీకి ఆదేశించారు.



నిందితుడు గిరీష్‌ను కోర్టుకు తీసుకువచ్చిన పోలీసులు

నూతన కార్యవర్గం ఏర్పాటు

బెంగళూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): దొడ్డబళ్ళాపుర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం నూతన కార్యవర్గం గురువారం ఏర్పాటయ్యింది. తాలూకా పరిధిలోని అన్ని పత్రికల ప్రతినిధులు కలిసి కొత్త కార్యవర్గం అధ్యక్షులుగా చంద్రశేఖర్ డి ఉప్పార్‌ను ఎంపిక చేశారు. గౌరవాధ్యక్షుడిగా కేసీ రుద్రేష్, ఉపాధ్యక్షుడిగా కొత్తూరప్ప మునిరాజు, ఎం మునిస్వామిలు, ప్రధాన కార్యదర్శిగా చంద్రప్ప, కార్యదర్శులుగా పురుషోత్తం గౌడ, సయ్యద్ అబ్దుల్ రహమాన్, పురుషోత్తం కోశాధికారిగా కృష్ణమూర్తి ఎంపికయ్యారు. తాలూకా కార్యవర్గ సభ్యులుగా పలువురిని ఎంపిక చేశారు.



సభ్యులను సత్కరిస్తున్న పాత్రికేయులు

హరోం హర..

శివనామస్మరణతో కొత్తచెరువు మార్మోగింది. మండల కేంద్రంలో వెలసిన సంగమేశ్వరుడి రథోత్సవం గురువారం వేలాది మంది భక్తాదుల శివనామస్మరణ నడుమ అత్యంత వైభవంగా సాగింది. స్వామివారి బ్రహ్మోత్సవాలు వారం రోజులుగా కొనసాగుతున్నాయి. గురువారం బ్రహ్మ రథోత్సవం సందర్భంగా సంగమేశ్వరుడు, పార్వతి దేవి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పల్లకీలో తీసుకొచ్చి రథంపై ఆశీనులు గావించారు. ఉదయం 11.30 గంటల సమయంలో భక్తులు నమఃశివాయ అంటూ రథాన్ని లాగారు. వేలాదిగా భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. సాయంత్రం మడుగు తేరును లాగి యథాస్థానంలోకి తేరును తీసుకొచ్చారు. -కొత్తచెరువు



వేలాదిమంది భక్తుల నడుమ కదులుతున్న రథం



రథంలో ఆశీనులైన పార్వతీపరమేశ్వరులు

హంస వాహనంపై చెన్నకేశవుడి విహారం



పట్టణంలో వెలసిన శ్రీలక్ష్మీచెన్నకేశవ బ్రహ్మోత్సవాల తొమ్మిదోరోజు గురువారం ఉదయం స్వామివారు పుష్పమండపంపై, సాయంత్రంపై హంస వాహనంపై ఊరేగారు. ఉదయాన్నే స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పుష్పమండపంపై కొలువుదీర్చారు. పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం 10గంటలకు వసంతోత్సవం, చక్రస్నానం కనులపండువగా సాగింది. సాయంత్రం 6గంటలకు హంసవాహనంపై స్వామివారు.. భక్తులకు దర్శనమిచ్చారు. -ధర్మవరం



హంసవాహనం, పుష్పమండపంపై ఆశీనులైన చెన్నకేశవుడు



జనసందోహం నడుమ కదులుతున్న రథం

రామభక్తా.. శ్రీ ఆంజనేయా..

జైశ్రీరామ్ నామస్మరణతో హిందూపురం మండలంలోని సంతేబిదునూరు గ్రామం మార్మోగింది. రామభక్తుడైన ఆంజనేయ స్వామి బ్రహ్మరథోత్సవం గురువారం వైభవోపేతంగా సాగింది. స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బ్రహ్మరథోత్సవం వేలాది మంది భక్తుల నడుమ సాగింది. మధ్యాహ్నం ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహించారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం మేళతాళాల మధ్య రథం వరకు తీసుకెళ్లారు. తేరుపై అధిరోహింపజేసి, పూజలు నిర్వహించారు. అనంతరం రథాన్ని ముందుకు లాగారు. ఉమ్మడి జిల్లాతోపాటు కర్ణాటక నుంచి వేలాదిగా తరలిరావడంతో గ్రామం జనసంద్రమైంది. రథోత్సవానికి హాజరైన భక్తులకు పలువురు టీడీపీ నాయకులు అన్నదానం చేశారు.

-హిందూపురం

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



అలుపెరగని అన్నదాత

● 523 రోజులకు చేరిన రైతుల నిరసన

కంప్లి, మే 23 : కర్మాగారాల నిర్మాణానికి భూములు పోగొట్టుకున్న రైతులు తమకు న్యాయం చేయాలని చేపట్టిన ఆందోళన గురువారానికి 523 రోజులకు చేరుకుంది. కుడితిని, అరిగిణదోణి, జానెకుంట, కొళగల్లు, యర్రంగళి, సిద్దమ్మనహళ్లి, వేణి వీరాపురం గ్రామాల రైతులు తిరిగి తమ భూములు ఇవ్వాలని తమకు న్యాయం లభించాలని కుడితిని బస్టాండు వద్ద డేరాలు వేసుకుని పోరాటం చేపడుతున్నారు. కానీ ఇంత వరకు నాయకులు గానీ, అధికారులు గానీ ముందుకు రాలేదని బసవరాజు, తిప్పేస్వామి, జంగ్లి సాబ్, సత్తిబాబు తదితరులు వాపోతున్నారు. బెల్గామ్‌లో జరిగిన సమావేశంలో తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారే గానీ చర్యలు శూన్య మన్నారు. కేవలం ఎన్నికలు వున్నాయని జాగ్రత్తలు వహించి తమ పార్టీ గెలుపు కోసం రైతులను మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా న్యాయం చేయకపోతే త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు.



కుడితిని వద్ద నిరసనలో పాల్గొన్న రైతులు

కాంగ్రెస్ అధ్యక్ష రేసులో లేను : మంత్రి సతీష్ జార్కిహొళి

బెంగళూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష రేసులో లేనని, అనుభవం కలిగిన సమర్థులకే అవకాశం దక్కాలని మంత్రి సతీష్‌జార్కిహొళి అభిప్రాయపడ్డారు. బెంగళూరులో మంత్రి గురువారం మీడియాతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగిశాక కేపీసీసీ సారథి మారుతారనే ప్రచారంపై మీడియా ప్రశ్నకు స్పందిస్తూ ఎన్నికలకు ముందే అధిష్టానం ప్రకటించిందన్నారు. లోక్‌సభ ఎన్నికలు ముగిసేదాకా డీకే శివకుమార్ అధ్యక్షుడిగా కొనసాగుతారంటూ ప్రకటించింది. ప్రస్తుతం రాష్ట్రంలో రెండువిడతల పోలింగ్ ముగియడం, మరో పదిరోజుల్లో ఫలితాలు వెలువడుతున్న తరుణంలోనే కేపీసీసీ అధ్యక్ష మార్పు ప్రస్తావన పార్టీలో జోరుగా సాగుతోంది. ప్రస్తుతం ఇంకా అధ్యక్షుడు ఉన్నారని ఖాళీ చేశాక అధిష్టానం నిర్ణయం తీసుకోనుందన్నారు. నాలుగేళ్ళపాటు రాష్ట్రమంతటా తిరిగి పార్టీని సమర్థవంతంగా నడిపే వారు రావాలన్నారు. కాగా డీకే శివకుమార్ బుధవారం రాత్రి ఇచ్చిన విందులో దాదాపు మంత్రులందరితో పాటు ముఖ్యనేతలందరూ పాల్గొన్నారు. రాజకీయంగా పలు అంశాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది.

సంబరాలకు నో

● తిరునాలకు బ్రేక్... బాణసంచాపై నిషేధం

● ఎన్నికల నేపథ్యంలో పోలీసుల చర్యలు

అనంతపురం క్రైం, మే 23: తిరునాళ్లు.. జాతర అంటే సంబరం అంతా ఇంతా కాదు. అయితే ఈసారి అంతజోష్ ఉండదు. కేవలం స్వామికి కొబ్బరికాయ కొట్టి దర్శనం చేసుకొని రావాల్సిందే. ఇక ఎన్నికల గెలుపోటముల అనంతరం టపాసుల శబ్ధం రాకూడదు. సంబరాలకు పోలీసులు నో చెప్పేశారు. తాడిపత్రి పట్టణంలో జరిగిన అల్లర్లు, జిల్లాలో అక్కడక్కడ జరిగిన సంఘటనల నేపథ్యంలో పోలీసులను ఈ నిర్ణయం తీసుకున్నారు. పెన్నహోబిళం తిరునాళ్ల మామూలుగానే జరిగిపోతోంది. అయితే వివాదాస్పద ప్రాంతాలు, నియోజకవరాల్లో నిర్వహించే తిరునాళ్లు, జాతర్లకు నో చెప్పేశారు. పెద్దవడుగూరు మండలం రామరాజుపల్లి, కాశేపల్లి, గుత్తి అనంతపురంలలో ప్రతి ఏటా వైశాఖ మాసంలో పున్నమి రోజున బండి శూల తిరునాళ్లు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది ఉత్సవాలకు పోలీసులు వద్దని చెప్పేశారు. అధికారులు గ్రామ పెద్దలతో చర్చించినా విఫలమయ్యాయి. ఎన్నికల అనంతరం అని చెప్పినా అప్పుడు ఎవరు అధికారంలోకి వస్తారో..? వారితో మరో పార్టీ వారు కయ్యానికి దువ్వడం లాంటి ఘటనలు జరుగుతాయని పోలీసులు నో చెప్పేశారు. కావాలంటే ఆలయంలో సింపుల్‌గా వెళ్లి పూజలు చేసుకోవచ్చని సలహా ఇచ్చారట.

టపాసుల వాడకంపై నిషేధం : కలెక్టర్

అనంతపురం క్రైం/ టౌన్: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పేలుడు చట్టం 1884లోని సెక్షన్ 6(ఏ) మేరకు జూన్ 6వతేదీ వరకు టపాసుల వాడకంపై నిషేధం విధించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టపాసుల తయారీ, అమ్మకాలు, కొనుగోలు, వినియోగం చేయకూడదని పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థుల మద్దతుదారులు విజయోత్సవాలు నిర్వహించే సమయంలో టపాసులు వినియోగించరాదన్నారు. ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఆ ప్రకటనలో హెచ్చరించారు.

అక్రమంగా నిల్వచేసిన టపాసులు సీజ్

పుట్టపర్తి రూరల్: ఎనుమలపల్లిలో అక్రమంగా నిల్వచేసిన టపాసులను సీజ్ చేసి కేసు నమోదుచేసినట్లు అర్బన్ సీఐ కొండారెడ్డి తెలిపారు. తనిఖీల్లో భాగంగా గురువారం ఎనుమలపల్లి శిల్పారామం వెనుకభాగంలోని గోవర్ధన్‌రెడ్డికి చెందిన వ్యవసాయ గోదాములో అక్రమంగా నిల్వ ఉంచిన రూ. 45వేల టపాసులను స్వాధీనం చేసుకున్నారు.



టపాసుల గొడౌన్‌ను పరిశీలిస్తున్న సీఐ కొండారెడ్డి